# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ఈ విజయాలపై మౌనమేల?

**రాజకీయానికి,** రాజనీతిజ్ఞతకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. మొదటిది తాత్కాలికమైంది. రెండోది దీర్ఘకాలికమైంది. మన రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఎక్కువ రోజులేం కాలేదు. ఇప్పటికీ రాష్ట్రానికి గుర్తింపులు, అవార్డులు వస్తూనే ఉన్నాయి. కొత్త ప్రభుత్వం ఇంకా పూర్తిగా కుదురుకోనేలేదు. ఇచ్చిన హామీలు ఎలా అమలు చేయాలా అని మల్లగుల్లాలు పడుతూనే ఉన్నది. నిధుల సమస్యపై సన్నాయినొక్కులు నొక్కుతూనే ఉన్నది. ఒక్క ముక్కలో చెప్పాలంటే పరిపాలన ఇంకా గాడిలో పడనే లేదన్న మాట. ఈ నేపథ్యంలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిపై ప్రశంసలు కురుస్తుంటే ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు చూసీచూడనట్టు వ్యవహరించడం చర్చాంశమైంది. జనవరి మొదటి వారంలో, అంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సుమారు నెల రోజులకు కేంద్రం నుంచి ఓ ప్రశంసాత్మక నివేదిక వెలువడింది. ఇంటింటికి మంచినీరు సరఫరాలో వంద శాతం లక్ష్యాన్ని సాధించిన పది రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచినట్టు ఓ నివేదిక విడుదల చేసింది. ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్ ఆ తర్వాతి స్థానంలో ఉంది. ఇది రాష్ట్రానికి గర్వకారణమైన విషయం. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథకు కేంద్రం పైసా ఇవ్వలేదు. అవార్డులు ఇచ్చి, ప్రశంసలు కురిపించి చేతులు దులిపేసుకున్నదనేది వేరే విషయం.

ఏదేమైనప్పటికీ ఇది కాంగ్రెస్ నెలరోజుల్లో సాధించిన విజయం కాదు. ఇది తెలంగాణ ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత ఫలితం. మిషన్ భగీరథ కీర్తి కిరీటానికి మరో కలికితురాయి. రాష్ట్రానికి దక్కిన ఈ ఘనతను కాంగ్రెస్ ప్రభుత్వం చూసీచూడనట్టు వదిలేసింది. నిన్నటిదాకా దేశానికే ఆదర్శంగా ప్రభుత్వాన్ని నడిపినవారికి ఎక్కడ మంచిపేరు వస్తుందేమోనని అనుకొని ఉండవచ్చు. ఇక్కడ రాష్ట్రం ముఖ్యమనుకుంటే పార్టీ రాజకీయాలకతీతంగా ఇంటింటికి నల్లానీరు అందించాలన్న సంకల్పాన్ని ప్రశంసించి ఉండేవారు. అలా చేస్తే వారికీ మంచిపేరు వచ్చేది. విజయం సాధించినప్పుడు హుందాగా ఉండాలని పెద్దలు చెప్పిన మాటలు ఇక్కడ గుర్తుకురావడం సహజం. ఈ నివేదికకు కొంచెం అటూఇటుగా వెలువడిన భారత్ కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక రాష్ట్రం రాబడి గణనీయంగా పెరిగినట్టు వెల్లడించింది. ఈ విజయం కూడా ఇదివరకటి ప్రభుత్వం ఖాతాలోనిదే అని చెప్పక తప్పదు. ఆరేండ్లలో జీఎస్టీ వసూళ్ల 63 శాతం వృద్ధిని నమోదు చేశాయని కాగ్ నివేదిక లెక్కలతో సహా వెల్లడించింది. నిధుల్లేవని ఇల్లెక్కి కూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం దీనిమీదా పల్లెత్తు మాట్లాడలేదు. సొంత రాబడుల్లోనూ తెలంగాణ టాప్‌లో నిలిచింది. ఆ తర్వాత స్థానంలో హర్యానా, గుజరాత్ తొమ్మిదో స్థానంలో నిలిచాయి. ఇదీ పదేండ్ల కేసీఆర్ పాలన ఫలితమే కదా.

ఎలక్ట్రానిక్ రంగ అభివృద్ధికి కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) తోపాటు ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)ను మంజూరు చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేసీఆర్ ప్రభుత్వం పదే పదే చేసిన విజ్ఞాపనల వల్లనే ఇది సాధ్యమైందనేది జగమెరిగిన సత్యం. జహీరాబాద్ నిమ్జ్ పారిశ్రామిక వాడలో కంపెనీల సందడి మొదలైంది. ఇది కేసీఆర్ ఆలోచనల్లోంచి పురుడు పోసుకున్నదే. తొమ్మిదేండ్లలో రాష్ట్రం తలసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలంగాణ స్టేట్ ఎ గ్లాన్స్ పుస్తకం వెల్లడించింది. దీన్ని ప్రస్తుత ప్రభుత్వమే విడదల చేసింది. అదేం చిత్రమో కానీ ఖాళీ ఖజానా ఇచ్చి వెళ్లారని సన్నాయి నొక్కులు నొక్కేదీ వారే. నిన్నగాక మొన్న విడుదలైన నీతి ఆయోగ్ నివేదిక తెలగాణలో పేదరికం తగ్గిందని శుభవార్త చెప్పింది. గత తొమ్మిదేండ్లలో రాష్ట్రంలో పేదల సంఖ్య 83 శాతం తగ్గిపోవడం కేసీఆర్ ప్రభుత్వ పాలనకు మెచ్చుతునక. ఇవన్నీ కూడా నిన్నటి కేసీఆర్ ప్రభుత్వ విజయాల కొనసాగింపులే. ఆయన దార్శనిక నాయకత్వానికి ప్రతిధ్వనులే. ఇలాంటి అవార్డులు గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్రానికి కోకొల్లలుగా వచ్చాయి. ఇప్పటికీ వస్తున్నాయి. ఈ అవార్డుల వెనుక ఒక లోతైన ఆలోచన, అంతకుమించిన వివేచన, ఈ ప్రాంతంపై అంతులేని అధ్యయనం, అవధిలేని అభిమానం ఉన్నాయి. అందుకే తెలంగాణ విజయ దుందుభి మోగించింది. దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా పేరుగాంచింది. కానీ బట్టకాల్చి మీదేసి బద్నాం చేసేవాళ్లకు ఇలాంటివేవీ కనిపించవు. ప్రభుత్వం ఇప్పటికైనా విజ్ఞత, పరిణతి చూపించి స్వరాష్ట్రం సాధించిన ప్రగతిని ఒప్పుకొంటే బాగుంటుంది. దానికి కర్తలెవరో చెప్తే మరింత బాగుంటుంది. ఇది నిజాలు ఒప్పుకున్నవాళ్ల నిజాయితీని తేటతెల్లం చేస్తుంది.

# కేంద్ర విష వలయంలో దేశ రైతాంగం

స్వాతంత్ర్యానంతరం మన దేశాన్ని కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏండ్లు పాలించింది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దేశాన్ని కొన్నేండ్లు పాలించింది. ఈ రెండు జాతీయ పార్టీలే భారతదేశాన్ని 'నువ్వా.. నేనా..' అన్నట్టుగా విభజించుకొని మరీ పాలిస్తున్నాయి. అయితే అధికారం కోసం మాత్రమే ఆరాటపడే ఈ రెండు జాతీయ పార్టీలు ఇన్నేండ్లయినా దేశంలో వ్యవసాయరంగ అభివృద్ధి దిశగా నిర్ణయాలు తీసుకోకపోవడం శోచనీయం. రైతు సంక్షేమం దిశగా విధి విధానాలు రూపొందించకపోవడం విడ్డూరం.

దేశంలో మరో రెండు, మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఎప్పటిలాగే ఈ ఎన్నికల్లోనూ లబ్ధిపొంది అధికారాన్ని చేజిక్కించుకోవాలని జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తహతహలాడుతున్నాయి. గతంలో కాంగ్రెస్ పార్టీ రాజస్థాన్‌లో జాతీయ సమావేశం నిర్వహించింది. హైదరాబాద్‌లో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. కనీసం ఈ సమావేశాల్లోనైనా ఈ రెండు జాతీయ పార్టీలు వ్యవసాయరంగాభివృద్ధిపై, రైతుల సంక్షేమం గురించి ఒక్క నిమిషం కూడా చర్చించకపోవడం ఈ పార్టీలకు రైతుల పట్ల, దేశ వ్యవసాయరంగం పట్ల ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తున్నది.



బోయినపల్లి వినోద్ కుమార్



దేశంలో వ్యవసాయ రంగాభివృద్ధి, రైతుల సంక్షేమం, కనీస మద్దతు ధర పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధి విధానాలపై ఇటీవల ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ల చైర్మన్ చెంగల్‌రెడ్డితో సమగ్రంగా చర్చించాను. నాకు, ఆయనకు మధ్య జరిగిన చర్చను మీ ముందుకు తెచ్చే ప్రయత్నమే ఈ వ్యాసం.

దేశవ్యాప్తంగా సాగు పరిస్థితి సన్నగిల్లింది. వ్యవసాయ రంగం చిన్నాభిన్నమైంది. వ్యవసాయం అంటే చాలు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. అన్నదాతలు సాగు చేసేందుకు భయపడుతున్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో పంటలు పండించటం నిలిపివేశారు. వ్యవసాయం చేస్తున్న కొందరు రైతులు సాగు లాభసాటిగా లేదంటూ పెదవి విరుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వమేమో మద్దతు ధర ప్రకటిస్తున్నామని గొప్పలకు పోతున్నది. దేశంలోని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలేమో రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేస్తున్నామంటున్నాయి. అయినా రైతులు ఎందుకు సంతోషంగా లేరు. వ్యవసాయం ఎందుకు లాభసాటిగా ఉండటం లేదు? ఈ ప్రశ్నకు జవాబు రైతులకు తెలియదు! మేధావులకు అర్థం కాదు! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవు!

దేశానికి ఏటా ఎంతమంది డాక్టర్లు, ఎంతమంది ఇంజినీర్లు కావాలో ప్రభుత్వాలు, వర్సిటీలు నిర్ణయిస్తాయి. దవాఖానలు, హోటళ్లు, సిమెంట్, స్టీల్ పరిశ్రమల యజమానులు అవసరం మేరకు ఏర్పాటు చేసుకుంటారు. కానీ, మన దేశంలో ఏ పంట ఎంత పండించాలి? ఎంత నిల్వ చేయాలి? ఎంతమేరకు పరిశ్రమలకు వాడాలి? ఎంత ఎగుమతి చేయాలి? తదితర అంశాల గురించి నేటివరకూ ఎటువంటి ప్రాతిపదిక లేదు. వ్యవసాయ ఉత్పత్తి, ప్రణాళికలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడమే దీనికి ప్రధాన కారణం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమం అంటే రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని అందరి అభిప్రాయం. రాష్ట్ర ప్రభుత్వాలు పంట పండించేందుకు అవసరమైన నీరు, కరెంటు, రుణాలు, విత్తనాలు, సదుపాయాలు కల్పించాలి. ఇటువంటి వసతులు కల్పించిన తెలంగాణ తొలి ప్రభుత్వం తన బాధ్యతను సంపూర్ణంగా నెరవేర్చింది.

వ్యవసాయరంగంపై ఆధారపడిన దేశం మనది. అందుకే ఆ రంగాన్ని కాపాడుకునేటందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక ప్రాజెక్టులు నిర్మించి రైతులకు సాగు నీరు అందుబాటులోకి తీసుకువచ్చారు. రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్తునందించారు. గతంలో ఏ కేంద్ర ప్రభుత్వం కానీ, దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కానీ ప్రవేశపెట్టని విధంగా ఒక బృహత్తర 'రైతుబంధు' పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద రైతులకు పెట్టుబడి సహాయం చేశారు. తక్కువ ధరకే ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చి రాష్ట్రంలో ఉన్న ఎరువుల కొరతను తీర్చారు. రైతులకు సకాలంలో ఎరువులను అందించారు. కనీస వడ్డీతో రైతులకు బ్యాంకు రుణాలందించారు. దీంతో తెలంగాణ రైతులు వ్యవసాయం వైపు మొగ్గు చూపారు. తెలంగాణ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వలసలుపోయిన రైతులు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రాష్ట్రానికి వాపస్ వచ్చారు. కానీ, గత నెల రోజుల కాంగ్రెస్ పాలనను పరిగణనలోకి తీసుకున్నట్టయితే రాష్ట్రంలో వ్యవసాయ పరిస్థితులు తారుమారయ్యాయి. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో 'రైతుబంధు' డబ్బులు జమకాకపోవడమే దీనికి తాజా ఉదాహరణ. ఒక్క తెలంగాణ అనే కాదు, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతికూల నిర్ణయాల వల్ల దేశవ్యాప్తంగా రైతుల పరిస్థితి డోలాయమానంలో చిక్కుకున్నది.

రైతు పండించిన పంటకు అధిక ధర రావటానికి, నాణ్యత పెంచడానికి, ఎగుమతి చేయటానికి అవసరమైన చర్యలు తీసుకోవటం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. మొదటి నుంచి కేంద్ర ప్రభుత్వాలు అనేక రైతు వ్యతిరేక విధానాలను రూపొందించి వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి చేరకుండా అడ్డుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం రైతులను అణగదొక్కడానికి విధానాలు రూపొందించి వ్యవసాయాభివృద్ధిని అడ్డుకుంటున్నదనే విషయం చాలా మందికి తెలియదు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయిస్తుంది కానీ, అది శాస్త్రీయ పద్ధతిలో ఉండదు. ధరల నిర్ణయ కమిటీకి స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వాలని 30 ఏండ్ల నుంచి చేస్తున్న ప్రయత్నాన్ని కాంగ్రెస్ బీజేపీ ప్రభుత్వాలు అడ్డుకున్నాయి. పురుగుమందుల ధరలను అదుపు చేయటానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించలేదు. వీటిపై 18 శాతం పన్ను విధించింది. డీజిల్ ధర 100 శాతం పెంచింది. దీర్ఘకాలిక ఎగుమతులకు విధానాన్ని రూపొందించలేదు. ప్రస్తుతం దేశంలో 10 కోట్ల టన్నుల గోధుమలున్నా ఎగుమతిపై నిరంతరం అభ్యంతరాలు తెలియజేస్తూ ఆంక్షలు విధిస్తున్నది. జన్యుమార్పిడి పంటలను భారత రైతులకు అందుబాటులోకి తీసుకురావడం లేదు. అమెరికా, బ్రెజిల్ తదితర దేశాల్లో రైతులు పండించిన, జన్యుమార్పిడి సోయా తదితర పంటల దిగుమతులకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.

భారత ప్రభుత్వం పప్పు దినుసుల దిగుమతులకు ఆఫ్రికా దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందం చేసుకున్నది. బియ్యం, గోధుమలు, తదితర పంటలను ఎగుమతి చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు దీర్ఘకాలిక ప్రణాళికలను రచించకపోవటం గమనార్హం. రక్షణ, ఆరోగ్య, రవాణా, తదితర రంగాల్లో అంతర్జాతీయ పరిశ్రమలకు కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. కానీ, వ్యవసాయ రంగంలో ఇతర దేశాల్లో అందుబాటులో ఉన్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత రైతులకు అందుబాటులోకి రానీయకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం బాధాకరం.

> గత ప్రభుత్వాలు చేసిన ఈ లోపాల వల్ల ఉత్పత్తి అంతర్జాతీయ స్థాయిలో లేదు. నాణ్యతలో అనేక లోపాలున్నాయి. వ్యవసాయాన్ని అంతర్జాతీయంగా పెంచడానికి అవసరమైన సాంకేతిక విజ్ఞానాన్ని, పరికరాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి గత 30 ఏండ్లలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇందుకు ప్రధాన కారణాలేమంటే జాతీయ పార్టీల నాయకత్వానికి వ్యవసాయ అభివృద్ధి, రైతుల సమస్యల పట్ల అవగాహన లేకపోవడమే. కేంద్ర ప్రభుత్వ ఎగుమతి, దిగుమతుల విధానాలను దేశంలో ఉన్న పారిశ్రామికవేత్తలు ప్రభావితం చేస్తారు. దీనికి నిదర్శనం చక్కెర ఎగుమతి, దిగుమతులు, నూనె దిగుమతుల విధానాలు.

ప్రస్తుతం అధికంగాఉత్పత్తి చేసి పతనమవుతున్న రైతుల సమస్యలను పరిష్కరించాలంటే దేశంలో పంటల వారీగా ప్రణాళికలు తయారుచేయాలి. ఈ ప్రణాళికలు జిల్లాలు, రాష్ట్రాల వారీగా, దేశ స్థాయిలో తయారుచేసి అమలుచేయాల్సిన అవసరం ఉన్నది. వీటిని రూపొందించటంలో శాస్త్రవేత్తలు, పరిశ్రమల ఎగుమతిదారులతో కలిసి చర్చించాలి. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు ఇలాంటి ప్రణాళికలు తయారుచేసి అమలుచేస్తాయనే నమ్మకం దేశంలోని ఏ ఒక్క రైతుకూ లేదు. ప్రాంతీయ పార్టీలు వ్యవసాయ కేంద్రీకృత ఆర్థిక విధానాన్ని రూపొందించగలిగితే.. తప్పకుండా దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుంది. ఇలాంటి ప్రణాళిక రాజకీయంగా ప్రాంతీయ పార్టీల మధ్య ఐక్యతను పెంచేందుకు కూడా ఉపయోగపడుతుంది.

(వ్యాసకర్త: పార్లమెంట్ మాజీ సభ్యులు, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు)

## మాల్దీవులతో చర్చలు

మనకు, మాల్దీవులకు మధ్య చెలరేగిన వివాదానికి తెరపడనున్నది. ఈ నెల 14న ఇరుదేశాలకు చెందిన అధికారుల చర్చల్లో ఇది స్పష్టమైంది. మాల్దీవుల ప్రజలకు మానవీయ సాయం అందేలా ఇండియన్ ఏవియేషన్ ప్లాట్‌ఫామ్ సేవలు ప్రారంభించేందుకు ఇరుదేశాల మధ్య చర్చ జరగడం ముదావహం. తర్వాతి సమావేశం భారత్‌లో జరుగనున్నది.



\- రణధీర్ జైస్వాల్, విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి

# నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు!



రచ్చ దినేష్
89787 40475

వరల్డ్ ఎకానమీ ఫోరమ్ సమావేశాల్లో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదానీ గ్రూప్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారని మీడియాలో వచ్చిన వార్తలు చూసి ఒక్క క్షణం షాక్‌కు గురయ్యాను. ఈ సోషల్ మీడియా కాలంలో ఇలాంటి ఫేక్ వార్తలు చాలా వస్తున్నాయి కదా, ఇది కూడా అలాంటిదేమో అనుకున్నాను. ఎందుకంటే కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ మన మాజీ ప్రధాని పీవీకైనా గౌరవం ఇవ్వటానికి ఒప్పుకుంటుందేమో కానీ అదానీ గ్రూప్‌తో తమ పార్టీ నేతల దోస్తానాను ఒప్పుకోదు.

సోనియాకు నచ్చని వ్యాపారవేత్త సుబ్రతోరాయ్ సంగతి ఏమైందో కూడా మనకు తెలిసిందే. ఇక 'ప్రధాని మోదీ దేశాన్ని దోచి తన దోస్తు అదానీకి దేశ సంపద పంచిపెడుతున్నాడని' రాహుల్‌గాంధీ పొద్దున లేస్తే అదానీ జపం చేస్తుంటారు. అందుకే, కాంగ్రెస్‌కు చెందిన ముఖ్యమంత్రి అదానీ సంస్థలతో పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకున్నాడంటే నమ్మటానికి చాలా సమయమే పట్టింది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజంగానే దావోస్‌లో అదానీ గ్రూప్‌లకు సంబంధించి రూ.12,400 కోట్లతో పెట్టుబడులకు సంబంధించి అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో చాలామందితో సహా నాలోనూ కొన్ని ప్రశ్నలు మెదిలాయి. ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరామర్శించటానికి, ప్రధాని మోదీని కలవటానికి కూడా రాహుల్‌గాంధీ అనుమతి తీసుకున్న రేవంత్‌రెడ్డి అదానీ విషయంలో ఆ మాత్రం అనుమతి తీసుకోకుండా ఉంటారా? ఒకవేళ రాహుల్‌గాంధీ ఇందుకు అనుమతి ఇస్తే మాత్రం ఇక్కడ మన సీఎంను నిందించటానికి ఏమీ లేదు. రాహుల్ ఏది చెప్తే అది పాటించటం ఆయన ధర్మం. నిజానికి సీఎం రేవంత్‌రెడ్డి గతంలో అదానీని, ఆయన గ్రూప్ సంస్థలను రాహుల్ కన్నా ఎక్కువే విమర్శించారు.

నిజానికి కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా అదానీ సంస్థలతో ఒప్పందం చేసుకోదు. ఆ పార్టీ ఆరోపణలు చేసినట్టుగా అదానీ గ్రూప్ ఒక్క మోదీ జేబు సంస్థ మాత్రమే కాదు, యూఎస్‌కు చెందిన హిండెన్‌బర్గ్ అనే ఓ రీసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ మొత్తం డొల్ల అని ఆధారాలతో సహా నివేదిక ఇచ్చింది. అదానీ గ్రూప్ షేర్ వ్యాల్యూను కృత్రిమంగా పెంచారని... ఆ గ్రూప్ సంస్థల నిజమైన వ్యాల్యూకు, మార్కెట్ వ్యాల్యూకు సంబంధమే లేదని తేల్చిచెప్పింది. కేవలం కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ అండతో అదానీ గ్రూప్ అసాధారణంగా పెరిగిపోయిందని చెప్పింది. గతేడాది ఇచ్చిన ఈ నివేదిక కారణంగా అదానీ గ్రూప్‌నకు సంబంధించి షేర్లన్నీ కుదేలయ్యాయి. ఆ సంస్థలో పెట్టుబడులు పెట్టిన ఎల్‌ఐసీ సహా చాలామంది మదుపర్లు ఆగమయ్యారు. ఈ నివేదిక మీదనే కదా కాంగ్రెస్ సహా విపక్షాలన్నీ జేపీసీ వేయాలని పార్లమెంట్‌ను స్తంభింపజేశాయి. మరి కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి అదానీ సంస్థతో ఎలా ఒప్పందం కుదుర్చుకుంటారు? నిజానికి అదానీ గ్రూప్ కేంద్రంలో మోదీ సర్కార్ మీద ఆధారపడిన సంస్థ. ఒక్కసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకపోయినా.. మోదీ ప్రధాని కాకపోయినా అదానీ గ్రూప్ పేకమేడల్లా కూలిపోవటం ఖాయం.





రాష్ట్రానికి అదానీ గ్రూప్ పెట్టుబడులను తీసుకొచ్చామని కాంగ్రెస్ నాయకులు గొప్పలకు పోతున్నారు. కానీ, అవి తెలంగాణకు ఎప్పుడో రావాల్సిన పెట్టుబడులు. ఇదే దావోస్ వేదికగా అప్పటి తెలంగాణ మంత్రి కేటీఆర్‌ను కలిసి ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు గౌతమ్ అదానీ గతంలో ఎన్నోసార్లు ప్రయత్నం చేశారు. కానీ, కేటీఆర్ ఆ సంస్థను దగ్గరకు కూడా రానియ్యలేదు. కారణం బహిరంగమే. అదానీ సంస్థకు మోదీ అనుచిత లబ్ధి చేస్తుండటం. బీఆర్‌ఎస్ కూడా ఆ కంపెనీ మీద ఆరోపణలు చేసి ఉండటం. మనం ఆరోపణలు చేసిన కంపెనీని పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించటం ధర్మం కాదని కేటీఆర్ భావించారు. ఫండమెంటల్స్ ఏ మాత్రం బాగా లేకుండా అసాధారణంగా పెరిగిన కంపెనీని కేటీఆర్ ఏ మాత్రం నమ్మలేదు. ఒక ప్రభుత్వం మీద ఆధారపడిన ఇలాంటి కంపెనీ కారణంగా ఏదైనా జరగరానిది జరిగితే అది తెలంగాణకు నష్టమని ఆయనకు తెలుసు. ఆ కంపెనీని నమ్ముకున్న వారికి, ఉపాధి పొందేవారికి కూడా నష్టమే. అందుకే కేటీఆర్ అసలు అదానీ సంస్థల పెట్టుబడులపై ఆసక్తి చూపకుండా అంతకుమించిన ఎన్నో మల్టీ నేషనల్ కంపెనీలను తెలంగాణకు తీసుకువచ్చారు. బీఆర్‌ఎస్ వద్దనుకున్న కంపెనీతో ఒప్పందం చేసుకొని వాటినే గొప్ప అని ప్రచారం చేసుకోవటం కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుంది.

ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే... ప్రాంతీయ పార్టీలను భూస్థాపితం చేసేందుకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తమ సిద్ధాంతాలను పక్కనపెట్టి మరీ పనిచేస్తున్నాయనే అనుమానం కలుగుతున్నది. గతంలో నిజామాబాద్, కరీంనగర్ లోక్‌సభ, దుబ్బాక, హుజూరాబాద్ అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఈ రెండు పార్టీలు లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయనే విషయం బహిరంగమే. తాజాగా అదానీ గ్రూప్‌ను కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలోకి ఎర్ర తివాచీ వేసి స్వాగతం పలుకుతున్నారంటే కాంగ్రెస్, బీజేపీల దోస్తానా మరింత బలపడుతున్నది. మొత్తంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రి అదానీ గ్రూప్‌తో చేసుకున్న ఒప్పందాన్ని చూస్తుంటే.. 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు!' అనే కృష్ణశాస్త్రి కవిత గుర్తుకువస్తున్నది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ఇలాగే వ్యవహరిస్తే ప్రజలు సరైన సమయంలో సరైన రీతిలో బుద్ధి చెప్పటం ఖాయం.

# అయోధ్య తవ్వకాల్లో అరుదైన చరిత్ర

పెద్ద పెద్ద కందకాలు, పదుల సంఖ్యలో పర్యవేక్షకులు, పోలీసుల పహారాలో వందలాది కూలీలు చేతిలో పలుగు, పార పట్టుకొని తవ్వుతున్నారు. ఏ చిన్న వస్తువు దొరికినా దాన్ని భద్రపరుస్తున్నారు. ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు. 'ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్‌ఐ)' బృందం, పర్యవేక్షకులు, న్యాయవాదులను మాత్రమే అనుమతిస్తున్నారు. అది కూడా అలహాబాద్ హైకోర్టు జారీచేసిన పాసులుంటేనే. ఇదంతా ఏమిటనుకుంటున్నారా? నేడు అయోధ్య రామమందిరం నిర్మితమైన ప్రాంగణంలో.. ఒకప్పుడు ఏఎస్‌ఐ తవ్వకాలు జరిపిన నాటి జ్ఞాపకం.



సందీపన్ దేబ్

అది 2003 మే నెల. నేను ఔట్‌లుక్‌లో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్న రోజులవి. ఫైజాబాద్ (ప్రస్తుత అయోధ్య)కు చెందిన ఓ బంధువు నుంచి ఫోన్ వచ్చింది. 'వివాదాస్పద బాబ్రీ మసీదు ప్రాంగణంలో ఏఎస్‌ఐ నేతృత్వంలో తవ్వకాలు జరుగుతున్నాయి. ఆ తవ్వకాల్లో ఏం బయటపడుతున్నదో మీకు తెలుసుకోవాలని ఉందా?' అని ఆయన అడిగారు. వెంటనే యాజమాన్యంతో మాట్లాడి లక్నోకు బయల్దేరాను. అక్కడినుంచి అయోధ్యకు చేరుకున్నా.

బాబ్రీ మసీదు నిర్మించకముందు వివాదాస్పద ప్రాంగణంలో రామమందిరానికి సంబంధించిన ఆనవాళ్లున్నాయో? లేదో తేల్చాలని అలహాబాద్ హైకోర్టు అదే ఏడాది మార్చిలో ఏఎస్‌ఐను ఆదేశించింది. అప్పటినుంచి అక్కడ తవ్వకాలు జరుగుతున్నాయి. అక్కడ ఫొటోలు తీయడం నిషిద్ధం. అందుకే కెమెరా ఉండే ఫోన్‌తో చిత్రీకరించాలనుకున్నా. అప్పట్లో అది చాలా ఖరీదు. భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఫోన్ లోపలికి తీసుకెళ్లేందుకు వీలుకాలేదు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని ఏఎస్‌ఐ 4 x 4 మీటర్లు ఉండే కందకాలుగా విభజించింది. రెండు కందకాల మధ్య ఒక మీటరు దూరం ఉన్నది.

అక్కడేం జరుగుతున్నదో ప్రజలకు తెలియనివ్వడం లేదు. పర్యవేక్షకులు ప్రత్యేకమైన ద్వారం నుంచి లోపలికి వెళ్తున్నారు. రామ్ లల్లాను చూసేందుకు వెళ్తున్న భక్తుల కోసం తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం మధ్యలో నుంచి ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటుచేశారు. చుట్టుపక్కల ఏం జరుగుతున్నదో భక్తులకు తెలియకుండా పై నుంచి కింది వరకు ఇనుప గ్రిల్స్‌తో పాటు పరదాలు కట్టారు. భక్తులతో పాటు నేనూ లోపలికి వెళ్లాను. ఆ కారిడార్‌లో నిలబడి పరదాల వెనుక ఏం జరుగుతున్నదోనని గమనిస్తున్నాను. '245, 175, 160'.. అంటూ కూలీలు అరుస్తున్నారు. ఏం జరుగుతున్నదో తెలుసుకోవాలన్న కుతూహలం మరింత ఎక్కువైంది. రెండు పరదాలను కలుపుతున్న కుట్లను విప్పదీశాను. ఆ సమయంలో నన్ను పోలీసులు చూస్తే కచ్చితంగా అరెస్టు చేస్తారని నాకు తెలుసు. నా గుండె వేగంగా కొట్టుకుంటున్నది. అయినప్పటికీ నేను చేస్తున్న పని ఆపలేదు. కోట్ల మంది భారతీయుల ఆశలు, శతాబ్దాలుగా దాగి ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు అక్కడివారంతా ప్రయత్నిస్తున్నారు. పోలీసులు ఎప్పుడు వచ్చేస్తారో తెలియడం లేదు. ఒకటి, రెండు నిమిషాలకు మించి సమయం లేదని మాత్రం తెలుస్తున్నది. అయినా ఆ టన్నెల్‌లో సుమారు గంట పాటు ఉన్నాను. ఎవరూ చూడనప్పుడు పరదాల వెనుక నుంచి చూస్తున్నా. కొద్దిసేపటికి పురాతన కాలం నాటి మెట్లను వాళ్లు వెలికితీశారు. నల్లటి రంగులతో ఉన్న చాలాపెద్ద గోళాకారం లాంటి ఆకృతి కనబడ్డది. దాన్ని గమనిస్తే గతంలో అక్కడ యజ్ఞయాగాదులు చేసినట్టనిపించింది. బాబ్రీ మసీదు కింద మసీదును మించిన ఓ నిర్మాణం ఉందనడంలో సందేహం లేదని నాకర్థమైంది. కానీ, అది గుడినా? ప్యాలెసా? అనేది కచ్చితంగా చెప్పలేను. అక్కడ మాత్రం ఏదో నిర్మాణం ఉందని గట్టిగా చెప్పగలను.

తర్వాతి రోజు ఉదయాన్నే కొంతమంది స్థానికులను కలిశా. రామమందిరం స్కేల్ మోడల్‌నూ చూశాను. జనవరి 22న ఆవిష్కరించనున్న ఆలయానికి భిన్నంగా ఉందది. చెక్కిన రాతిస్తంభాలు, రాతి పలకలు తదితర నిర్మాణ సామగ్రి ఉన్న యార్డును సందర్శించాను. 'అనుమతి వస్తే రేయింబవళ్లు కష్టపడి ఆలయం నిర్మిస్తామని' కొంతమంది యువకులు నాతో చెప్పారు. 'అయోధ్యను కొంతమంది పవిత్రస్థలంగానే చూస్తారు. కానీ, ఇది యోధుల నగరం. లక్ష్మణ్ ఖిల్లా, హనుమాన్ గఢీ, చోటీ చావ్నీ తదితర ప్రదేశాలు ఇక్కడే ఉన్నాయి. క్షత్రియ ధర్మం ఇక్కడే ఉన్నది' అని ఒకతను నాతో చెప్పారు.

> ఆ తర్వాత 1949లో రామ్ లల్లాను బాబ్రీ మసీదు సెంట్రల్ డోమ్ కింద ప్రతిష్ఠించిన వారిలో ఒకరిగా చెప్పకుంటున్న వ్యక్తిని కలిశా. ఈ ఘటన తర్వాత వివాదాస్పద ప్రాంగణాన్ని మూసివేశారు. అనంతరం షా బానో ఉదంతం జరిగాక.. హిందువుల మనోభావాలను శాంతింపజేసేందుకు రాజీవ్‌గాంధీ హయాంలో గేట్లు తెరిచారు.

చరిత్రకారులు, న్యాయవాదులు, పర్యవేక్షకులను కలిశా. వారి సాయంతో అక్కడ ఉండే నిర్మాణానికి సంబంధించిన రఫ్ మ్యాప్‌ను తయారుచేశాను. దాన్ని ప్రచురించగా అది సంచలనంగా మారింది. ఆ తర్వాత జాతీయ మీడియాతో పాటు యూపీ మీడియా కూడా ఏఎస్‌ఐ కార్యకలాపాలను ప్రచురించాయి. నేను రాసినదంతా స్థానిక జర్నలిస్టులకు తెలిసిందే. కానీ, ఆ విషయాలను వారు పట్టించుకోలేదు. స్థానికంగా తెలిసిన విషయాన్నే జాతీయస్థాయిలో నేను వెలుగులోకి తీసుకువచ్చా. బాబ్రీ మసీదు కింద ఉన్నది గుడేనని నేను ఎన్నడూ చెప్పలేదు. కానీ, నేను రాసిన ప్రతి అక్షరం నిజమేనని.. ఆరు నెలల తర్వాత ఏఎస్‌ఐ విడుదల చేసిన నివేదికలో తేలింది.